# మగువ - మనసు

ఆరోజు ఆఫీసులో పని చాలా ఎక్కువగా ఉండి హడావిడి పడిపోతున్నాను.

అలాంటి సమయంలో నా చిన్ననాటి మిత్రురాలు శ్యామసుందరి ఊడిపడింది. అది వచ్చినందుకు ఆనందం కలిగినా, ఆ ఆనందం క్షణం కూడా నిలవలేదు. కనీసం ఆమెతో అయిదు నిముషాలైనా మాట్లాడే వీలు వుంటుందా అని భయం వేసింది.

"ఎపుడొచ్చావు? ఉంటావుగా. ఇంటికిరా రాత్రి సరదాగా కబుర్లు చెప్పుకుందాం" అన్నాను ఎదురుగా కుర్చీ వేయించి కూర్చోబెట్టి.

"అబ్బే లేదు. నేనిప్పుడు 2 గంటల బస్సులో వెళ్లిపోతున్నాను. ఇదిగో టికెట్ కూడా కొనేసుకున్నాను" అంది.

"అదేమిటే అంత హడావిడి? నాకు ఒంటిగంట వరకు విపరీతమైన పనుంది" అన్నాను బిక్కమొహం వేసి.

"ఫర్వాలేదులే నీతో ఒక ముఖ్యవిషయం చెప్పిపోదామని వచ్చాను. రెండే ముక్కల్లో చెప్తాను. మళ్ళీ వివరాలు ఉత్తరం రాస్తాను" అంది.

"అయితే చెప్పు" అంటూ చేతిలో కాగితాలు పక్కన పెట్టేశాను.

అది గొంతు సవరించుకుని "మీ బాబయ్యగారబ్బాయి ఒకతను పెళ్ళికి వున్నట్లున్నాడు కదూ" అంది.

"అవును మూడోవాడు వున్నాడు" అన్నాను.

"మా అత్తయ్య కూతురు విజయలక్ష్మి నీకు తెలుసుగా. అదిప్పుడు ఎమ్మెస్సీ చేసింది. మీ తమ్ముడికి చేసుకుంటారేమో కాస్త నువ్వు అడిగి చూడు. పిల్ల

బుద్ధిమంతురాలు. కట్నాలు మరీ పొయ్యలేరు. పెళ్ళిళ్ళ గురించి మాట్లాడాలంటే భయంగా వుంది" అంది.

"ఓ తప్పకుండా అడుగుతాను. ఇంతకు మునుపు వాళ్ళెవరికీ మాట యివ్వకపోతే మనం గట్టి ప్రయత్నమే చేద్దాం" అన్నాను.

శ్యామసుందరి కాగితం మీద ఆ అమ్మాయి వివరాలన్నీ రాసి ఇచ్చి వెళ్ళిపోయింది – ఆ పిల్లని నేను ఎరుగుదును ఫరవాలేదు బాగానే వుంటుంది. చాలా తెలివైంది. చదువులో అన్ని క్లాసులూ ఫస్టు క్లాసులే. ఎమ్మెస్సీలో కూడా చాలా ఎక్కువ మార్కు లొచ్చాయని ఒకసారి శ్యామసుందరే చెప్పింది.

మా బాబయ్యగారబ్బాయి ఇంగ్లీషు ఎమ్మే పాసయి లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. వాడి పెళ్ళి గురించి పిన్ని బెంగ పెట్టేసుకుంది. ఇప్పుడే పెళ్ళి వద్దంటున్నాడని పిన్ని వెళ్ళినప్పుడల్లా నా దగ్గర వాపోతోంది. వాడి పెళ్ళి ఒక్కటీ అయిపోతే తన బాధ్యత తీరిపోతుందని ఆమె ఆరాటం.

ఏమైనా సరే ఈ విజయలక్ష్మి గురించి అడిగి చూడాలి. ఎవ్వరూ పట్టించుకోకపోతే ఈ ఆడపిల్లలందరూ ఏమైపోతారు? అని కాస్సేపు బాధపడ్డాను. పిన్ని పెద్దగా డబ్బు మనిషి కాదు. కట్నం కానుకల విషయంలో కూడా తను చెప్పిచూడవచ్చు.

ఆ రోజు సాయంత్రం పనులన్నీ పక్కకి పెట్టి కంకిపాడు వెళ్ళాను. నన్ను చూసి పిన్ని ముఖం చాటంతయింది. నేను చెప్పిన విషయం విని మరీ మురిసిపోయింది.

"పిల్ల చదువుకున్నదీ, బుద్ధిమంతురాలు అయితే నాకు కట్నం పట్టింపులేదు" అంది పిన్ని.

"అయితే పిల్లాడికి పిల్ల నచ్చాలి"–

అదెవరూ కాదనరు. నా తమ్ముడు లేడు ఇంట్లో. ఎక్కడికో వెళ్ళాడు. ఎప్పుడొస్తాడో. అందుకని పిన్నితో చెప్పాను. "నువ్వేం చెప్పకు పిన్ని. నేనే ఆదివారం వస్తాను. వస్తానని ఇంట్లో వుండమని చెప్పు" అని.

చీకటి పడుతుండగా ఇంటికి వచ్చేశాను. మూడోనాడు నాకు శ్యామసుందరి దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది. చదివి ఆశ్చర్యంలో మునిగిపోయాను.

"సారీ జానకీ! నువ్వేమి అనుకోకు. మా విజయ సైన్సు గ్రూపు వాళ్ళనేగాని ఆర్ట్సు గ్రూపు వాళ్ళని పెళ్ళిచేసుకోదట. ఇప్పటికే నువ్వు అడిగేసి వుండవని ఇది వెంటనే రాస్తున్నాను – మరోలా అనుకోకు..." ఇంకా ఏవేవో రాసింది. క్రమేపీ నేను ఆశ్చర్యంలోంచి అసహనంగా అయిపోయాను.

ఒక వ్యక్తిని పెళ్ళిచేసుకోవాలంటే చదువూ సంస్కారం, వ్యక్తిలోని మంచితనం, ఆదర్శం, అవగాహన, భార్యని పోషించగల ఆర్థిక స్థోమతా ఇవి ముఖ్యం అని గ్రహించ కుండా, సైన్సు గ్రూపా, ఆర్ట్సు గ్రూపా అనేంత సంకుచితంగా ఆలోచించే ఈ ఆడపిల్లల పోస్టుగ్రాడ్యుయేషన్లు ఎందుకు?

జీవితాన్ని చక్కదిద్దుకోలేని నేటి ఆడపిల్లల ఆలోచనలు ఎటు పయనిస్తున్నాయి?

పాలపుంతవైపు చూస్తూ ముళ్ళ కంపకి చుట్టుకుపోతున్నారా అనే వేదనతో ఉత్తరం మళ్ళీ మళ్ళీ చదువుతూ వుండిపోయాను.

●